## క్లుప్తంగా

### బర్లిలో నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఏగిరెడ్డి కుటుంబసభ్యులు

బలిజిపేట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని బర్లిలో ఆదివారం 900 మంది నిరుపేదలకు చీరలు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఏగిరెడ్డి వెంకటినాయుడు, కోడలు భారతి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు నానిబాబు, గౌరీశ్వరరావులు గ్రామంలో ఉన్న నిరుపేద మహిళలు, పురుషులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.అప్పలనాయుడు, పెద్దలు పాల్గొన్నారు.

### వాసవీ క్లబ్ వితరణ



పేదలకు చీరలు, పళ్లు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు సత్యనారాయణ, గురుమూర్తి

సీతానగరం: మండల కేంద్రంలోని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పేదలకు చీరలు నగదు అందజేశారు. ఈ మేరకు వాసవీక్లబ్ ప్రతినిధులు ఆరిశెట్టి గురుమూర్తి ఆధ్వర్యంలో ఆయనతో పాటు కుమారుడు ఏవీ సత్యనారాయణ 50 మందికి చీరలు, పళ్లు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఆపదలో ఉన్నకుటుంబాలవారికి తమ వంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు. ఇటీవల సీతానగరంలో అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు.

### ఏపీటీజీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణదాస్

బొబ్బిలి రూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్(ఏపీటీజీ) జిల్లా అధ్యక్షుడిగా అలజంగి సీబీఎం పాఠశాల హెచ్ఎం కె.కృష్ణదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీటీజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.కె.చిన్నప్ప నాయామక ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణదాస్ మాట్లాడుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులతో పాటు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడతామన్నారు. ఏపీటీజీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణదాస్‌ను సోమవారం పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

### బాలఅన్నమ్మకు బోనాలు సమర్పణ



బాలఅన్నమ్మ పేరంటాలకు బోనాలు చెల్లిస్తున్న భక్తులు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో బాలఅన్నమ్మ పేరంటాలకు భోగి బోనాలు ఆదివారం సమర్పించారు. ఏటా సంక్రాంతి పర్వదినాన ఇలా అమ్మవారికి బోనాలు చెల్లిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### మహానేతను స్మరిస్తూ పూజలు



వైఎస్సార్ చిత్రపటం వద్ద నూతన దుస్తులు ఉంచి, పూజలు చేస్తున్న వాసునాయుడు

వంగర: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని స్మరిస్తూ మండలంలోని రుషింగికి చెందిన విజయనగరం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యలకల వాసునాయుడు పూజలు చేశారు. ఏటా సంక్రాంతి సందర్భంగా పూర్వీకులను స్మరిస్తూ ఎటువంటి పూజలు చేస్తారో అదే తరహాలో మహానేతకు పూజలు చేయడం విశేషం.



సీతానగరం: ఇసుక దిబ్బలపై ఉద్యోగుల మాటామంతీ



సీతానగరం: ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు, వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



సీతానగరం:మరిపివలసలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ వరలక్ష్మి

# ఘనంగా పండగ సంబరాలు

సీతానగరం:

జిల్లా అంతటా ప్రజలు సంక్రాంతి, కనుమ పండగ సంరాలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. గ్రామాల్లో జన్మించి వందల, వేల కిలోమీటర్ల దూరంలో ఉద్యోగాల రీత్యా స్థిరపడిన వారంతా సంక్రాంతి పండగకు వచ్చి ఉన్న మూడు రోజులు సన్నిహితులతో ఆనందంగా కాలం గడిపి సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు సంక్రాంతి రోజున సీతానగరం మండలంలోని చినభోగిలి, పెదభోగిలి గ్రామాల్లో మహిళలకు ప్రతిఇంటా ముగ్గుల పోటీలు న్విహించి విజేతలకు బహుమతులు ప్రదా నం చేశారు. అలాగే కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం సువర్ణముఖి నదిని ఆనుకుని ఉన్న చినభోగిలి, సీతానగరం, బూర్జ, పెదంకలాం, చెల్లన్నాయుడువలస, చినంకలాం తామరఖండి ఇసుక దిబ్బలవద్దకు చేరుకున్న ప్రజలు చిన్నవయస్సులో జరిగిన సంఘటనలు, గడిపిన సందర్భాలను నెమరు వేసుకున్నారు. అలాగే బూర్జలో నదిఒడ్డుకు చేరుకున్న జిల్లా ఇమ్యునైజేషన్ వైద్యాధికారి టి.జగన్మోహనరావు తన చిన్న నాటి స్నేహితులు పాత కొత్త కలయికలను గుర్తు చేసుకున్నారు. గ్రామస్తులంతా ఇసుక దిబ్బల వద్దకు చేరుకుని ఒకరికొకరు సంఘీభావం తెలియజేసుకున్నారు. పంటలు బాగా పండడంతో మహిళలంతా ఇసుక దిబ్బలవద్ద ఆటలుపోటీలు నిర్వహించుకుని ఆనందంగా గడిపారు.



సీతానగరం: బూర్జవద్ద ఇసుక దిబ్బలపై పలుకుటుంబాలు



సీతానగరం: చినభోగిలిలో సంక్రాంతి రోజున డూడూ బసవన్న



సీతానగరం: పెదభోగిలి కాలనీలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న సర్పంచ్ జే తేరేజమ్మ

**సాలూరులో..**

సాలూరు: పెద్దపండగలైన సంక్రాంతి, కనుమలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, పూజలతో పండగ నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాలలో నివసిస్తున్న వారంతా పట్టణం, మండలాల్లోని తమ స్వస్థలాలకు పండగకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది.

# పీపీఎల్ విజేత 'ట్రోఫీ ఫైటర్స్'

జియ్యమ్మవలస:

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పెదబుడ్డిడి ప్రీమియర్ లీగ్(పీపీఎల్) క్రికెట్ పోటీలు ముగిశాయి. సోమవారం సాయంత్రం జరిగిన ఫైనల్స్‌లో ట్రోఫీ ఫైటర్స్ జట్టు ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించి, ట్రోఫీ విజేతగా నిలిచింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ట్రోఫీ ఫైటర్స్ నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. అనంతరం 71 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన రౌతు మురళి జట్టు 10 ఓవర్లకు 7 వికెట్ల నష్టపోయి 66 పరుగులు మాత్రమే చేయగలిగింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను ఎస్.రాజు కైవసం చేసుకున్నాడు. విజేత జట్టుకు రూ.3 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ. 2 వేల నగదును బహుమతిగా అందజేశారు.



బహుమతితో విజేత జట్టు

## పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

రేగిడి: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల అబ్జర్వర్ పాలవలస రామచంద్రినాయుడు అన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి, ఈ పదవిని కట్టబెట్టిన పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## అ'పూర్వ' కలయిక

భామిని: మండలంలోని బత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయత, అనురాగాలతో పలకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అల్లంశెట్టి హరిబాబు, సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావులను సన్మానించి, పెద్దల పట్ల తమకున్న గౌరవ, మర్యాదలు చాటుకున్నారు.



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

## వీరజవాన్లను గుర్తుంచుకోవాలి



జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న యువత

చీపురుపల్లి: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీర జవాన్లను దేశ ప్రజలు నిరంతరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇండియన్ ఆర్మీ డేను ఆదివారం నిర్వహించారు. యువత జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి రమణ మాట్లాడుతూ యువత దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాలని కోరారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన జవాన్లకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హేమంత్, నవీన్ పాల్గొన్నారు.

## గోమాతకు పూజలు

రేగిడి: కనుమ పండగ సందర్భంగా మండలంలోని అంబకండి, రేగిడి, వన్నలి, ఉనుకూరు, సంకిలి గ్రామాల్లో సోమవారం గోమాతకు పూజలు చేశారు. గోవును పూజిస్తే ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగడంతో పాటు పంటలు బాగా పండుతాయనే నమ్మకంతోనే ప్రజలు పూజిస్తారు.

వంగర: మండలంలోని సంగాం గ్రామ సంగమేశ్వరాలయం వద్ద సోమవారం గోమాతకు పూజలు నిర్వహించారు. పాడిఆవులకు స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో పూజించారు.



రేగిడి: గోమాతను పూజిస్తున్న మహిళా రైతు



వంగర: సంగమేశ్వరాలయంలో గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

# ఆకట్టుకున్న నగర సంకీర్తన



పాలకొండ రూరల్: భక్తిగీతాలు ఆలపిస్తూ వీధుల్లో తిరుగుతున్న గ్రామస్తులు

పాలకొండ రూరల్: మండలంలోని అంపిలి గ్రామంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్ నేతృత్వంలో ఆదివారం చేపట్టిన మేలుకొలుపు, నగర సంకీర్తన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తిగీతాలు ఆలపిస్తూ గ్రామస్తులు తిరువీధి చేపట్టడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, చిలకాం, దళాయివలస గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

వేకువజామునే ఆయా గ్రామాల భజన మండలి సభ్యులు భక్తిగీతాలు ఆలపిస్తూ వీధుల్లో తిరిగి, ప్రజలను మేల్కొలిపారు.



గరుగుబిల్లి: పెద్దూరులో భజన చేస్తూ వీధుల్లో తిరుగుతున్న భజనమండలి సభ్యులు

## రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: ఏపీ రైతు సంఘానికి సంబంధించిన రైతు వాణి క్యాలెండర్, డైరీను ఆ సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు నీలకంఠరాజపురంలో సోమ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట చినరామునాయుడు మాట్లాడుతూ సాగు సలహాలు, సూచనలతో రైతులకు ఉపయోగపడే విధంగా సంఘ సభ్యులు క్యాలెండర్ రూపొందించడం అభినందనీయమని అన్నారు.

## ఘనంగా గోవర్ధనగిరి జాతర

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో గోవర్ధన గిరి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో యాత్రలో పాల్గొన్న భక్తులు కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరను తర తరాలుగా ధర్మకర్తలు ఊడు తవిటమ్మ, లక్ష్మణరావు, కృష్ణారావు, సత్యనారాయణ నిర్వహిస్తుండడం గమనార్హం. జాతర నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ రాగోలు పద్మజరమేష్‌నాయుడు తెలిపారు.



జాతరకు పోటెత్తిన జనం

# దుస్తుల వితరణ



పాలకొండ రూరల్: వృద్ధుడికి దుస్తులు అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు



వీరఘట్టం: పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి దంపతులు

వీరఘట్టం: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని కంబరవలస గ్రామంలో సర్పంచ్ మరడాన లక్ష్మి, కేశవరావునాయుడు దంపతులు నిరుపేదలకు ఆదివారం దుస్తులు వితరణ చేశారు. దాదాపు 200 మందికి చీరలు, పంచెలు, దుప్పట్లు అందజేసి, ఏటా సంక్రాంతి రోజున పేదలకు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని దాతలు తెలిపారు.

పాలకొండ రూరల్: మండలంలోని 26 గ్రామాలకు చెందిన మొత్తం 175 మందికి పాలకొండ మండల భగవాన్ శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం వస్త్రదానం చేశారు. విశాఖపట్నానికి చెందిన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి జె.షణ్ముఖరావు సహకారంతో వాటిని వారి గ్రామాలకు వెళ్లి మరీ అందించినట్లు సేవా సమితి కన్వీనర్ ఆర్.కిశోర్ తెలిపారు.

# తొలగిన తాగునీటి ఇక్కట్లు

విజయనగరం: నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా అన్ని వార్డుల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పా టు చేసింది. గత ప్రభుత్వంలో ఐదురోజుల కోసారి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయగా.. ప్రస్తుతం రోజు విడిచి రోజు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో..**

గతంలో విజయనగరంలో తాగునీటి ఎద్దడి విపరీతంగా ఉండేది. ఎప్పుడు కుళాయిలు వస్తాయో.. ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితి. మహిళలు పనులు మానుకుని కుళాయి పాటింట్ల వద్ద రోజంతా నిరీక్షించేవారు. వేసవిలో అయితే నీటి కష్టాలు మరింత అధికమయ్యేవి. ప్రజల తాగునీటి ఇబ్బందులు దగ్గర నుంచి చూసిన కోలగట్ల వీరభద్రస్వామి.. 2019లో ఎన్నికల ప్రచారంలో తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేగా గెలుపొందిన మరుక్షణం నుంచే తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. అమృత్ పథకం నిధులతో నగరంలో దాసన్నపేట, చెంచుల కాలనీ తదితర ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను నిర్మించారు. అంతేకాకుండా నగర వ్యాప్తంగా 600 వరకు ఇంటర్ కనెక్షన్లను ఏర్పాటు చేశారు. పంపింగ్ సామర్థ్యాన్ని పెంచారు. రూ.200 లకే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కుళాయి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుంటే, సంబంధిత అధికారులు దాన్ని పరిశీలించి వెంటనే కుళాయి ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు కావడంతో తాగునీటి కష్టాలు తొలగిపోయాయి.



నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్)

**లీకుల నివారణపై దృష్టి**

వేసవిలో కూడా రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా ఇంజినీరింగ్ అధికారులతో సమాలోచనలు జరిపారు. ముసిడిపల్లి నుండి అధిక ప్రాంతాలకు తాగునీటి పంపిణీ జరుగుతోంది. ఇటీవల ముసిడిపల్లి ప్రాంతంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇంజినీరింగ్, ఆర్అండ్‌బీ, కార్పొరేటర్ల సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. నగరంలోని అన్ని పైపులైన్లను నిశితంగా పరిశీలించి లీకుల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కోలగట్ల ఆదేశించారు. 40 ఏళ్లుగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న బుచ్చన్న కోనేరు ప్రాంతంలో ఇటీవల కోలగట్ల చొరవతో అధికారులు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.